# దంపతులు

శ్రీమతి వి. అమ్మాజీ

ఆనంద్ తండ్రినుండి ఉత్తరం ఓ ఫొటో రావటం చూచాడు.

"ఫొటో జనార్దనంగారి అమ్మాయి విజయది. కట్నం ఇరవై వేలిస్తారునీకిష్టమైతేసమ్మర్ లోనేపెండ్లిజరగాలి" అని

ఆనంద్ విస్మయంపొందాడు! తనూ ఎంచుకొంటున్న విజయనే తండ్రి ఎన్నుకొన్నందుకు, అతని పుత్సాహానికి అంతులేదు. తండ్రిని అభినందించాడు.

విజయ సుగుణవతి. చాలా అందమైంది. స్కూల్ ఫైనల్ చదివింది. క్రిందటి సమ్మర్ లో ఆనంద్ తెనాలి వెళ్ళినప్పుడు విజయ అన్న రామకృష్ణతో జనార్దనంగారి ఇంటికి వెళ్ళాడు. అప్పుడే తన అన్నకోసరం విజయ వాళ్ళున్న రూమ్ లోకి వచ్చి ఆనంద్ నుచూచి సిగ్గుతో మెరుపులా మాయమైంది. ఆమె సౌందర్యానికి ఆనంద్ ముగ్ధుడయ్యాడు. ఆమెను చూడాలనే- ఆశతో అతని నేత్రాలు వెతుక్కో-సాగాయి. ఇంటికిపోతూ లోపలికి చూచాడు. విజయ కర్టెన్ ఒత్తిగించుకొని తన్ని ఓరగా చూస్తుంది. ఆ జరిగిన దృశ్యాన్ని వర్ణించుకొన్నాడు. ఫొటో చూచాడు. ఆ సౌందర్యమే! తండ్రికి తన సమ్మతాన్ని తెలియచేశాడు.

ఆనంద్ స్ఫురద్రూపి. సహృదయుడు. నైతికదృష్ట్యా చూస్తే అంతటి సాత్వికుడు లేడనవచ్చు. అతనిప్పుడు మద్రాస్ లో ఎమ్.బి.బి.ఎస్. చదువుతున్నాడు.

♦ ♦ ♦

నిర్ణయించుకొన్నట్లుగానే విజయా ఆనంద్ లకు పెండ్లి వైభవముగ జరిగిపోయింది. అయితే! వధూవరులు పెండ్లిపీటలపైనుండి లేవకుండానే పెద్ద సంఘర్షణ జరిగింది ఇస్తానన్న కట్నమివ్వక పదివేలే ఇచ్చారని! ఆనంద్ తండ్రి ఉగ్రుడై పుత్రుని తీసుకొనిపోయాడు అంతే! ఉభయులకు మనస్పర్థలు కలిగి పట్టుదలలు పెరిగిపోయాయి. ఒకరి ముఖం ఒకరు చూచుకోకుండా వున్నారు.

ఆనంద్ కు తీరనిబాధ కలిగింది. హృదయంలో పొంగిపొర్లే ఆనంద మధురభావాలు త్రుటిలో తెగినట్లయింది. కట్నమనే గొడ్డలితో పవిత్ర నిర్మల హృదయాన్ని బ్రద్దలుచేయబూనటం!!! ఆనంద్ తండ్రిని ప్రతిఘటించలేకపోయాడు. అవును! తనేం చెయ్యగలడు! తండ్రిని వ్యతిరేకిస్తే రానున్నఫలితం తెలుసు. తనిప్పట్లో ఏమీచెయ్యలేడు. ముందు తన చదువు పూర్తయి. ప్రాక్టీసు మొదలుపెట్టాక విజయను తీసుకెళ్ళవచ్చు. యీసంగతి రామకృష్ణతో చెప్పి మద్రాస్ పోవుటకు నిశ్చయించుకొన్నాడు. అయితే! రామకృష్ణను తను కలుసుకోలేకపోయాడు. రామకృష్ణ తనముఖమైనా చూడకుండా వెళ్ళిపోయాడు. అవును! తన తండ్రికే అంతపట్టుదలైనప్పుడు వాళ్ళ కెందు కుండదు? తన తండ్రి స్థితిపరుడైనా స్వార్థంతో కట్నందగ్గర మూర్ఖత వహించాడు. ఈ కట్నాల దురాశగల తల్లితండ్రులనెదిరించి నిరుద్యోగ స్థితిలో నిలబడే తనలాంటి యువకులకు దారేది? యీ కట్నాల ఆశ సుఖాంతము కాగల దాంపత్య జీవితాలని నాశనం చెయ్యటమేకదా!

ఆనంద్ వ్యధిత హృదయంతో మద్రాస్ వెళ్ళినాడు.

♦ ♦ ♦

విజయ తండ్రి ఆనంద్ కుటుంబము సంగతితేసంచా ఇంట్లో కట్టడిచేసాడు. విజయను కాలేజీలో చేర్పించాడు. ఇట్టిపరిస్థితిలో విజయ కాలేజీకి వెళ్ళి చదువుకోటానికి ఇష్టపడలేదు. అయితే! తండ్రిమాటకు తిరుగులేదు.

ఆనంద్ కుటుంబమువారికి విజయ చనువుగురించి మరింత అసూయాద్వేషాలు కలిగాయి. ఆనంద్ తల్లీ చెల్లెలూ తండ్రికి విజయపట్ల లేనిపోని అపార్థాలుచెప్పారు. మరలపెండ్లి చేద్దామన్నారు. ఇందుకాయన సిద్ధపడ్డాడు! ఆనంద్‌కు తమ ఉద్దేశాలు తెలిపారు. ఆనంద్ హృదయం క్షోభించిపోయింది! విజయ యీ ఇంట్లో అడుగైనా పెట్టలేదే! ఆమెపై ఇంతపగా! ఇంత నిర్దాక్షిణ్యమా! తండ్రి కట్నమివ్వనందుకు ఆమెపై ఇంత అమానుషత్వమా! నిజముగ విజయ యీ ఇంట్లోకి వచ్చివుంటే ఆమెనెంత వేధించేవారో! భగవంతుడు కరుణామయుడు విజయను కాపాడినాడు! అనుకున్నాడు.

తల్లి దండ్రులు బిడ్డల్ని కనిపెంచి పెద్దవాళ్ళను చేసి చివరకు ధన ధాన్యాలు! మేడమిద్దెలు! ఇత్యాది స్వార్థాలతో వాళ్ళ హృదయాలికి చిచ్చుపెడతారు. అది చివరకు ఎట్టివిధంగా పరిణమించినా దానికి నిష్కృతి అనేదిలేదు! ఇది లోకం నడవడి!!!

♦ ♦ ♦

ఆనంద్ తన తండ్రి తెనాలి రమ్మనినా వెళ్ళకుండా మద్రాస్‌లోనే వుంటున్నాడు. అతనిప్పుడు డాక్టర్‌గా, పొందాడు. ఎవరికై తనింతదీక్షపరుడై స్వతంత్రుడైనాడో అట్టి తన సతీమణి విజయ సందర్శనంకొరకు అతని హృదయం తహతహలాడుతోంది. ఏదో బావోద్వేగంతో ఆరాటపడుతోంది.

ఆనంద్ మద్రాస్‌నుండి తెనాలి వెళ్ళుటకు ట్రెయిన్ ఎక్కుతూ అనుకున్నాడు, విజయ తన్నిగురించి ఏమనుకొంటున్నదో! ఇన్నాళ్ళు తన్ని నిర్లక్ష్యం చేశానని నిష్కృతిలేదంటూ నిరాకరిస్తుందా? కానీ ఆమెపై అతనికి నమ్మికవుంది తన్నివిశ్వసిస్తుందని.

♦ ♦ ♦

సాయంకాలం అన్నాతండ్రీ క్లబ్బుకువెళ్ళాక విజయ బయట వరాండాలోకివచ్చి నిలబడింది. ఆమె ఆలోచనపూర్వకంగా ఆకాశంవైపు చూచింది. బంగారుకిరణాలు వెదజల్లుతున్న ప్రభాకరుని దివ్య స్వర్ణారుణ కాంతులకు ఆ మబ్బులు రంగురంగులుగ మారి తేలిపోతున్నాయి. ఏపుగా పెరిగివున్న గులాబిరెమ్మలు చల్లగాలికి నాట్యం చేస్తున్నాయ్. అందులో వికసిస్తున్న జంటగులాబులు తన్ని ఆహ్వానిస్తున్నాయ్. అప్రయత్నంగా ఆమె దృష్టి గేటువైపు మళ్ళింది. ఆమె చకితురాలయింది! ఆ వస్తున్నది ఎవరు? ఇన్నాళ్ళనుండి ఎవరికై తపస్సు చేస్తున్నదో! ఎవరికై ఎదురుత్రోవలు చూస్తున్నదో! ఆ ప్రేమైకమూర్తి! తన భర్త! ఆనంద్!! ఆమెహృదయం ఆనంద్‌తో విప్పారింది!!

ఆనంద్ ఆమె సామీప్యానికివచ్చి మృదువుగ అన్నాడు.

విజయా! నిన్ను తీసుకువెళ్ళుటకు వచ్చాను!

ఆమె సిగ్గుతో తలవంచుకొంది.

అతడుమరల అన్నాడు మృదువుగ.

విజయా! ఇన్నాళ్ళనుండి రాలేదనికోపమా! నన్ను క్షమింపవా!

ఆమె సిగ్గుతో నిర్మలమైన మందహాసముతో ముఖాన్ని ఉజ్వలంగాచేసుకొని

ఎందుకు! కోపం! మీరేంచేశారని! అంది మాధుర్యమైన కంఠంతో.

ఆనంద్ ముగ్ధదృష్టితో రెప్పవాల్చకుండా ఆమె ముఖంలోకి చూస్తున్నాడు. అదేసమయంలో ఆమె అతనిని చూచింది. ఇద్దరికళ్ళు కలుసుకొన్నాయ్. ఆనందంతో వారి హృదయాలు తన్మయత్వం పొందాయి. ఆక్షణంలోనే జనార్ధనంగారు వచ్చాడు! ఆయనముఖంలో అగ్నిజ్వాలలు ప్రస్ఫుటమౌతున్నాయ్.

విజయ కంపించి పోయింది. ఆయన కోపంతో విజయను లోపలికి వెళ్ళమని అరచాడు. ఆయన ఆనంద్ మీద విరుచుకుపడ్డాడు. దూషణవాక్యాలతో అతని హృదయాన్ని గాయపర్చాడు. అయినప్పటికీ ఆనంద్ తనను క్షమింపమని ప్రాధేయపడ్డాడు! విజయను పంపెంచమని అర్థించాడు! ఆయన పాషాణ హృదయం కరుగలేదు. విజయను పంపేది లేదని తలుపులు ధడాల్ని వేసుకున్నాడు.

జనార్దనంగారి నౌకరు వీరాస్వామి పలుకరించేవరకు ఆనంద్‌కు తెలీదు. తనెంతసేపటినుండి అలా నిలపడ్డాడో! వీరాస్వామి ఆనంద్‌తో బయటకువస్తూ అన్నాడు, లాలనగా. బాబూ! అయ్యగారి మాటలకు ఏమీ అనుకోకండి. చిన్నమ్మగారి మనస్సు నాకు తెలుసు. ఎప్పుడో మీదగ్గరకే వచ్చివేస్తారు.

వీరాస్వామి మాటలు అతని హృదయానికి ఆశలు గొల్పాయి!!

తండ్రి భర్తనుఅన్నమాటల్కి విజయ భరించలేక పోయింది. ఆమె హృదయం క్షోభించిపోయింది. ఆమె దిండులోనికి తలదూర్చి వెక్కి వెక్కి ఏడ్చింది. ఆమె తన భవిష్యత్తును తలంచుకొని లోలోన కుమిలిపోయింది. తన కర్తవ్యాన్ని స్మరించుకొంది. తను చెయ్యకల్గేది ఒక్కటే! అది! తనకుతానై భర్తకడకువెళ్ళిపోవటమే!!!

♦ ♦ ♦

విజయ గేటులోనుండి వస్తూచూచించి. భవనంపై తనపేరుతో చక్కని అక్షరాలు చెక్కబడివుండటం!! భర్త ప్రేమకు ఆమె చలించింది!! పనిమనుష్యులు తనకు భయభక్తులతో వుపచారాలు చేస్తున్నారు. క్రిందా పైనా తనఅభిరుచులకు అనువైన పద్ధతులతోనూతనమైన సామానులు అమర్చివున్నవి. హాల్లోని బీరువాలలో మంచి మంచి గ్రంథములు పేర్చబడివున్నవి. క్రింద చక్కని పూదోట ఆమె భర్తను అభినందించుకొంది. ఆనంద్ తనకు భర్తగా లభించినందులకు తన అదృష్టమునకు మురిసిపోయింది.

ఆనంద్ సాయంకాలం అయిదుగంటలకు అప్పుడే వూరునుండి తిరిగివచ్చి కారు దిగుతూనే వీరాస్వామిని చూచి అంతా తెల్సుకొన్నాడు. తల్లీ తండ్రీ అన్నా. ఎవరితో చెప్పకుండా విశ్వాసపాత్రుడైన ఈముసలి నౌకరును వెంటపెట్టుకొని భార్య భర్తదగ్గరకు వచ్చివేసినది!! ఆనంద్ సంతోషానికి మేరలేదు!

విజయకొరకు పైకి శబ్దముకాకుండా వెళ్ళాడు. ప్రయాణంబడలికవల్ల విజయ ఇంకా నిదురపోతూనే వుంది. ఆనంద్ ఆమెను చూస్తున్నాడు. అపూర్వ తేజస్సుతో కూడుకొన్న ఆమె సుందరమైన ముఖంలో చిరునవ్వు చూచాడు. ఆమె ఎట్టి మధురస్వప్నాలు కంటున్నదో! తను విజయను భార్యగా పొందకలిగినందులకు అదృష్టవంతుడనని అనుకొన్నాడు. అతను సవ్వడి చెయ్యకుండా క్రిందికి వెళ్ళాడు. రాత్రి విజయ చక్కని దుస్తులు ధరించుకొని వెన్నెల్లో సోఫాలో కూర్చుంది. చంద్రుని కాంతులకు ఆమె మెడలోనున్న రవ్వల కంఠాభరణం ధగధగమెరుస్తూ ఆమెసౌందర్యాన్ని మరింత వ్యక్త పరుస్తున్నాయ్. సుందరమైన ప్రకృతిని విజయ తన్మయత్వంతో చూస్తుంది. ఆర్చిపై అల్లుకొనియున్న సన్నజాజిమాలతీ తీగలు పిల్లగాలులకు అతి వయ్యారంగా వంగుతూ నాట్యంచేస్తున్నాయ్. సన్నజాజులు విరియబూసి సుగంధాలు విరజిమ్ముతున్నాయ్. ఆకాశంలో పక్షులు జంటలుగ స్వేచ్ఛగా ఎగురుతున్నయ్. గదిలో రేడియో సంగీతం నెమ్మదిగ మధురముగ వినవస్తుంది. ఆమె తిరిగి చూచింది. మందహాసముతో వస్తున్న ఆనంద్‌ను.

విజయ సిగ్గుతో లేచి నిలుచుంది. ——


# కిన్నెర

## సచిత్ర మాసపత్రిక

**ఎడిటర్ పందిరిమల్లికార్జునరావు ★ అసిస్టెంట్ ఎడిటర్: పందిరి మీరాబాయి**

ఆంధ్రాభ్యుదయానికి కంకణంకట్టుకున్న పత్రిక కిన్నెర. ఆంధ్ర జనానీకం పత్రిక కిన్నెర. ఆంధ్ర సేవకై పుట్టిన పత్రిక కిన్నెర. మన సంఘం, మన ఆర్థిక జీవనం, ఈ విషమ పరిస్థితులలో ఏవిధంగా పునర్నిర్మాణం కావలసిందీ, మన జీవిత సమస్యలూ, వాటిని యెట్లా పరిష్కరించవలసినదీ వర్ణించే హృదయంగమములైన కథలతోను వినోదాన్ని, విజ్ఞానాన్ని చేకూరుస్తుంది కిన్నెర.

భాష, సాహిత్యం, శిల్పం, కళ, ఆర్థిక రాజకీయ విషయాలు, శాస్త్ర విషయక వ్యాసాలు, కథలు, నాటికలు మొదలైనవాటితో సర్వాంగ సంపూర్ణంగా ముచ్చటైన ఆకారంతో ప్రకటింపబడుతుంది.

విడి కాపీ 6 అణాలు —— సంవత్సర చందా 4 రూపాయలు.

మేనేజరు

కిన్నెర, 16, జోన్సు స్ట్రీట్, మదరాసు-1.